ప్రతి ఇంటిపై జెండాను ఎగరేయాలి


జెండాను పంపిణీ చేస్తున్న డివిజన్ కార్పొరేటర్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జిల్లా మహిళా మోర్చ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తా నుంచి మర్రిచెట్టు సర్కిల్ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రతి ఇంటిపై జెండాను ఎగరవేసి తమ దేశ భక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సి. బీరప్ప, జిల్లా బీజేపీ మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి అనిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇందిర, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సిద్ధప్ప, కౌన్సిలర్‌లు శ్వేతరవికాంత్‌రెడ్డి, వందన నగేష్, కోఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, నాయకులు వీణ, లతా, భువనేశ్వరి, గౌరీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటికి జాతీయ జెండాలను కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 5న ప్రతి ఇంటిపై జెండాను ఆవిష్కరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండి నోరోత్తం రెడ్డి, భవానిదాస్, నరసింహా, వెంకటరమణ, మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభించిన నరేందర్‌రెడ్డి

కాలనీ అభివృద్ధికి కృషి


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న కార్పొరేటర్

బండ్లగూడ: పద్మశ్రీహిల్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అమరేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సతీష్, ట్రెజరర్‌గా సావార్కర్, వైస్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పవన్‌కుమార్, రవికిరణ్, మల్లారెడ్డి తదితరులు సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మంగళవారం కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి కోసం కాలనీ వాసులంతా కలిసి నూతన కమిటీని ఎన్నుకోవడం అభినందనీయమని అన్నారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానన్నారు.

కార్మికులకు అన్యాయం చేయొద్దు


ధర్నా చేస్తున్న కార్మికులు

శంషాబాద్: మధ్యాహ్న భోజన కార్మికులు ఎంపీడీ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గణేష్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులను ఆదుకుంటామని వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారి జీవితాలతో ఆడుకుంటుందని ఆరోపించారు. మధ్యాహ్న భోజనాన్ని హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరపాలని అన్నారు. సీఐటీయూ నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు ఆపండి



బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మణికొండ: మణికొండ మర్రిచెట్టు సర్కిల్ నుంచి పలు కాలనీల మీదుగా రాయదుర్గంలోని లక్ష్మణ్ బాగ్ వరకు సోమవారం రాత్రి మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి ఉంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అక్కడి కొత్త ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి పెన్ నెంబర్ ఇవ్వాలి


విద్యాశాఖాధికారిని సన్మానిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాల ప్రతి నిధుల బృందం సోమవారం రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో యాజమాన్య సంఘాల ప్రతి నిధులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లతో ఆయన ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి పెన్ నెంబర్ (శాశ్వత విద్యా సంఖ్య) ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అదే పెన్ నెంబర్ ఆ విద్యార్థికి 12వ తరగతి వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి పాఠశాలకు తన పరిధిలో సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు ప్రభాకరచారి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, కోశాధికారి రజనీకాంత్, వాజీద్, ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు అంతస్తులు నిర్మించొద్దు


భాగ్యలక్ష్మికాలనీలో కూల్చిన అదనపు అంతస్తు స్లాబ్


పెంట్‌హౌస్, అంతస్తు స్లాబ్‌లను కూల్చిన సిబ్బంది

మణికొండ: భాగ్యలక్ష్మి కాలనీలో అదనపు అంతస్తులు నిర్మించిన రెండు భవనాల పై అంతస్తులను మంగళవారం టీపీఓ సంతోష్‌సింగ్ కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలను చేసుకోవాలని, లేదంటే కూల్చివేతలు తప్పవని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులను జారీ చేస్తున్న వాటిపై కొందరు అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని, అలాంటి వాటిని ఎట్టి పరిస్థితిలో సహించే ప్రసక్తేలేదన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి భవనాలను హైడ్రా పూర్తి స్థాయిలో కూల్చివేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

రాయదుర్గం: వైభవ మహాలక్ష్మీ మహా నిలయం రాయదుర్గంలో మూడు రోజుల పాటు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విద్యా ఉపాసకులు జాడ జగదీష్ శర్మ ఆధ్వర్యంలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ కృష్ణాగౌడ్, భరత్‌కుమార్, సతీష్‌కుమార్ శ్రీరామ్ పర్యవేక్షణలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. లక్ష్మీ గణపతిపూజ, పుణ్యాహవాచన, రక్షాధారణ, ఋత్విక్‌వరుణ, అఖండ దీపారాధన, అంకురారోపణ, యాగశాల ప్రవేశం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం మండల మండప పునఃపూజ, శకల దేవతాశక్తి మంత్రోక్తహోమాలు, భేరి మూర్తులకు ధాన్యాధివాసం. వేదస్వస్తి తీర్థ ప్రసాద వితరణ చేస్తారు.


ఖాజాగూడలోని మోడల్ శ్మశానవాటిక ప్రధాన గేటు


ఖాజాగూడలో శ్మశానవాటికలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారం

మోడల్ గ్రేవ్‌యార్డ్!



గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో 'మోడల్ గ్రేవ్‌యార్డ్' పేరతో హడావుడిగా శంకుస్థాపన పనులు ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఈ స్థలంవైపు అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం. ఖాజాగూడలో మోడల్ గ్రేవ్ యార్డ్‌కు శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు. శంకుస్థాపన తర్వాత మళ్లీ ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడకపోవడం మరీ విడ్డూరం. 2023 మే19న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. దీన్ని త్వరితగతిన అందుబాటులో తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను అప్పట్లో ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టకపోవడం పనులలో పురోగతి లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –రాయదుర్గం

ఘనంగా సత్కారం


కమిషనర్‌ను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న టి. కృష్ణమోహన్‌రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, నాయకులు శ్రీనివాస్, కిరణ్, లంకల పాపిరెడ్డి, వినోద్‌కుమార్, రాము పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సాయం


సీసీ కెమెరాల పునరుద్ధరణ కోసం చెక్కుల అందజేత

శంషాబాద్: మండలంలోని గండిగూడ, ఘాన్సిమియాగూడ గ్రామాల్లో సీసీ కెమెరాల పునరుద్ధరణకు కాంగ్రెస్ నేతలు సాయం అందించారు. మంగళవారం శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రూ. 15 వేలు సీసీ కెమెరాల పునరుద్ధరణ కోసం అందజేశారు.

ఘన స్వాగతం



బండ్లగూడ: ఎస్సీవర్గీకరణ సాధించుకోని నగరానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికారు. ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి మందకృష్ణమాదిగను కలుసుకున్నారు. మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ, గంగని మహేందర్, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి యాదయ్య, సామెల్, అర్జున్ తదితరులున్నారు.

రోడ్డుపై తొలగిన నీరు

మణికొండ: ఔటర్ సర్వీసు రోడ్డు నుంచి క్రిన్స్ విల్లాల ముందు ఐటీ జోన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై నిలిచిన వరద నీటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. చెరువును తలపిస్తున్న రోడ్డు అంటూ మంగళవారం పలు పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ వెంటనే స్పందించి తమ సిబ్బందితో అక్కడకు వెళ్లారు. రోడ్డుపై నిలిచిన నీటిని మోటార్లతో కొంత తీసేసి, మ్యాన్‌హోల్‌లను గుర్తించి వాటిని తెరచి నీరంతా పోయేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు నీటిని వెంటనే తొలగించిన మున్సిపల్ అధికారులకు అభినందనలు తెలిపారు.


మ్యాన్‌హోల్‌ను తెరుస్తున్న మున్సిపల్ సిబ్బంది

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కౌన్సిలర్ శైలజ

మణికొండ: మున్సిపాలిటీ 16వ వార్డు మణికొండ క్వార్టర్స్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం కౌన్సిలర్ పి.శైలజవినోద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు, పిల్లలకు దోమలు కరవకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న చిన్నారులకు పౌష్టికారం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలపై ఉందని, అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను మున్సిపాలిటీ నుంచి కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇన్వెస్టిచర్ వేడుకలు


విద్యార్థులతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరితాపునియా, ఉపాధ్యాయులు

రాయదుర్గం: నేటి విద్యార్థులు రేపటి నిజమైన నాయకులుగా మారాలని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరితాపునియా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ కేంద్రీయ విద్యాలయలో ఇన్వెస్టిచర్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కష్టపడి పనిచేయడం ద్వారా సమాజం, విద్యార్థులు ప్రతి పనిని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఆటలు, కళలు, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీ పడుతూ ముందుకుసాగాలన్నారు. అంతకుముందు ఇన్వెస్టిచర్ మార్చ్‌పాస్ట్‌ను నిర్వహించారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్లు, క్రీడా, కోకరిక్యులర్, స్కూల్ క్రమశిక్షణా కమిటీ, హౌజ్ కెప్టెన్లు స్కూల్ జెండాలను చేతబూని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీసీఏ ఇన్‌చార్జి జ్యోతి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌బీ ఫెలోగా ప్రొ. రవికుమార్‌గుట్టి



రాయదుర్గం: హెచ్‌సీయూ ప్రొఫెసర్ రవి కుమార్ గుట్టి రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీకి ఫెలోగా నియామకమయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్(ఎస్ఎల్ఎస్) బయో కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా ఆయన పనిచేస్తున్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ అనేది జీవశాస్త్రం కోసం ఒకే ఏకీకృత స్వరం, ఇది ప్రభుత్వానికి సలహిస్తూ విధానాలను ప్రభావితం చేస్తుంది. విద్యా, వృత్తిపరమైన అభివృద్ధి చేస్తుందన్నారు. సభ్యులకు మద్దతు ఇవ్వడంతోపాటు జీవిత శాస్త్రాలలో ప్రజల ఆసక్తిని ప్రోత్సహిస్తుందన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో ఉన్న రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ యొక్క ఫెలోషిప్ జీవశాస్త్ర పరిశోధన, బోధన లేదా జీవశాస్త్రంపై పట్టు ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు. ఈ సందర్భంగా అందించే ఫెలోషిప్ అనేది ఆర్ఎస్‌బీ సభ్యత్వం యొక్క అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రేడ్, జీవశాస్త్రాల పురోగతికి విలక్షణమైన, గుర్తించదగిన సహకారాన్ని ప్రదర్శించిన దరఖాస్తుదారులకు సభ్యత్వ ఎన్నికల తర్వాత ఇవ్వబడుతుంది.ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవికుమార్ మాట్లాడుతూ.. రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీకి ఫెలోగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు.

మైనర్ బాలికను గర్భవతి చేసి ఆపై అబార్షన్

వ్యక్తిపై కేసు నమోదు

శంషాబాద్: మైనర్ బాలికను గర్భవతి చేయడంతో పాటు అబార్షన్ చేయించిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన గిరిజన మహిళతో పాటు ఆమె కూతురు (15) జూకల్ గ్రామానికి చెందిన మన్నె కృష్ణారెడ్డి (35) పొలంలో కొంతకాలంగా కూలీ పనులు చేస్తున్నారు. కొంతకాలంగా సదరు బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్న యజ మాని పొలం పక్కనే ఉన్న గదిలో పలుమార్లు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భవతి అని తెలియడంతో కొత్తూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం అబార్షన్ చేయించాడు. విషయం తెలిసిన బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి



రాయదుర్గం: రక్తానికి ప్రత్యామ్నాయం లేదని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ భవానిశ్రీ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఫీనిక్స్ అక్విలా(టవర్ బి)లో ఫీనిక్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌తో కలిసి వ్యవస్థాపకుడు చుక్కపల్లి శంకర్ రావు స్మారకార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రక్తం చాలా ముఖ్యమైనదని, దాన్ని ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందగా ముందుకు రావాలని ఆమె సూచించారు. రక్తాన్ని దానంగా స్వీకరించి అవసరమైన వారి వినియోగించేలా చేయడంలో ఫీనిక్స్ ఫౌండేషన్ కృషిని ఆమె అభినందించారు. సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) డి జోయెల్‌డేవిస్, ఫీనిక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గోపికృష్ణ, గ్రూప్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాడిగ, బ్లడ్‌బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, డైరెక్టర్ అవినాష్‌చుక్కపల్లి, మధుమతిచుక్కపల్లి, పాటిబండ అపర్ణ, ఆకాశ్ చుక్కపల్లి, పలు వురుసంస్థ అధికారులు పాల్గొన్నారు.

నియామకం


సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా ఎం.ప్రభాకర్ నియమితులైయ్యారు. కార్పొరేషన్ ఉపాధ్యక్షులుగా నవీన్, శ్రీధర్, కోశాధికారిగా రాకేష్, మణికాంత్, సంయుక్త కార్యదర్శులుగా అనిల్, బాలు, సాయిబాబు, సలహాదారులుగా గురు, విష్ణు, సభ్యులుగా శివయ్య, మద్దప్ప, నర్సింహులు, రాజు, నర్సింహులు, శంకర్ తదితరులు నియమితులైయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ప్రతినిధి ప్రేమ్‌గౌడ్, సంఘం అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ నాయీ, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, యాదేశ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ.. సంఘం సభ్యులందరి సహాయ సహకారాలు తీసుకోని ముందుకు సాగుతానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్డి సేవాసమితి అధ్యక్షుడిగా మునగాల



శంషాబాద్: శంషాబాద్ రెడ్డి సేవా సమితి అధ్యక్షులుగా ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన మునగాల సుధాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వైఎన్నార్ గార్డెన్‌లో మంగళవారం జరిగిన రెడ్డి సేవా సమితి కార్యవర్గ నియామక కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న రెడ్డి సేవా సమితిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మునగాల సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయనను సేవాసమితి నాయకులు ఘనంగా సన్మానించారు. బుచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, చెన్నారెడ్డి, బాబురెడ్డి, లవకుశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత


బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలో నివసించే సిద్దిరెడ్డి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద అతని భార్యకు వైద్యం నిమిత్తం 60 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం అనేక మంది పేదలకు ఈ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్, కోట పవన్, సిద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉమ్రా యాత్రకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 70మంది యాత్రికులు మంగళవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్రా యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిర్వహిస్తూ ప్రజలకు అసౌకర్యాలు లేకుండా చూస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ పనులను సక్రమంగా నిర్వహించాలని, పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ కాలనీలో ఎన్నికలు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా జి.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా కె. రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం. సత్యనారాయణ ఆచార్యులు, సహాయ కార్యదర్శిగా పి. మనోజ్‌కుమార్, కోశాధికారిగా వై. ప్రేమ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.సంతోష్‌యాదవ్ ఎన్నికయ్యారు. మంగళవారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రిటర్నింగ్ అధికారులు ప్రభుజీ, అజ్మతుల్లాల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ.. కాలనీ సర్వతోముఖాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిల్, అధికారులతో సమన్వయం చేసుకుని పెండింగ్ పనుల పూర్తికి కృషి చేస్తామన్నారు.


ఎంప్లాయిస్ కాలనీ నూతన కార్యవర్గం